నమస్తే తెలంగాణ

తెలంగాణ జైత్రయాత్ర 2023

హైదరాబాద్ | శుక్రవారం 10 నవంబర్ 2023 www.ntnews.com

■ మీకు తెలుసా?

**తెలంగాణలో నీటి పారుదల సౌకర్యం**

| 2014-15లో | 2022-23లో | కేసీఆర్ పాలనలో పెరుగుదల |
|---|---|---|
| 62.48 లక్షల ఎకరాలు | 153.53 లక్షల ఎకరాలు | 145% |



| తెలంగాణ పారిశ్రామికరంగ విజయాల్లో ముఖ్యాంశాలు.. | ఇప్పటి వరకు వచ్చిన పెట్టుబడులు | ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన టీఎస్ఐపాస్.. | ఎస్సీ పారిశ్రామికవేత్తలకు పదేండ్లలో ఇచ్చిన ప్రోత్సాహకాలు | పరిశ్రమల కోసం ప్రభుత్వం నిర్ధారించిన భూములు | ఇప్పటి వరకు కేటాయించిన భూములు | 24 గంటలు | నీటి పారుదల ప్రాజెక్టుల్లో పరిశ్రమలకు 10 శాతం నీటి కేటాయింపు |
|---|---|---|---|---|---|---|---|
| | రూ.3.3 లక్షల కోట్లు | 15 రోజుల్లోనే పరిశ్రమలకు అనుమతులు | రూ.1400 కోట్లు | 1.45 లక్షల ఎకరాలు | 28,000 ఎకరాలు | నిరంతరం విద్యుత్తు, నీటి సరఫరా | |

# దశ, దిశ మార్చేందుకు

# పరిశ్రమించిరిలా..



చందన్‌వెల్లిలోని వెల్‌స్పన్ కంపెనీ

## పదేండ్లలో మారిన తెలంగాణ పారిశ్రామిక రంగం

బిగ్ స్టోరీ

- రూ.3.3 లక్షల కోట్ల పెట్టుబడులు
- కొత్తగా 22.50 లక్షల ఉద్యోగాల సృష్టి
- స్వరాష్ట్రంలో 23 వేలకుపైగా పరిశ్రమల రాక
- మూడు రెట్లు పెరిగిన ఉపాధి అవకాశాలు
- పెద్ద రాష్ట్రాలను వెనుకకు నెట్టిన తెలంగాణ
- ఆకర్షిస్తున్న ప్రభుత్వ విధానాలు.. క్యూ కడుతున్న పారిశ్రామికవేత్తలు
- టీఎస్ ఐపాస్‌తో దేశానికి రోల్ మాడల్‌గా నిలిచిన తెలంగాణ

బండ మీద పంట పండించే ఆలోచనలు చేయడంలో సీఎం కేసీఆర్‌ది ప్రత్యేక స్థానం.. ఆకలి కేకల గానం చేసిన తెలంగాణను దేశానికి అన్నం పెట్టే స్థాయిలో నిలబెట్టేందుకు తనదైన మార్కుతో 'పరిశ్రమి'ంచారాయన.. ఫలితంగా స్వరాష్ట్రంలో పారిశ్రామికరంగం కొత్త పుంతలు తొక్కుతున్నది. గడిచిన పదేండ్లలో రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు, వేలాది కంపెనీల రాక చకచకా జరిగిపోయింది.. లక్షలాదిగా ఉద్యోగాల సృష్టి జరిగింది. పారిశ్రామికరంగ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన టీఎస్ ఐ-పాస్ చట్టం దేశానికే ఆదర్శంగా నిలిచింది.. దేశ, విదేశాలకు చెందిన దిగ్గజ సంస్థలు తెలంగాణను పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చుకున్నాయి.



**దండుమల్కాపూర్ ఇండస్ట్రియల్ పార్క్**

తెలంగాణ ఇండస్ట్రియలిస్ట్స్ ఫెడరేషన్ (టీఐఎఫ్) భాగస్వామ్యంతో ఎంఎస్ఎంఈల అభివృద్ధి కోసం 523 ఎకరాల్లో గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌ను అభివృద్ధి చేశారు. ఇందులో 621 కంపెనీలకు ఇప్పటికే భూములను కేటాయించగా, రూ.1,200 కోట్ల పెట్టుబడులు రావడంతో 19,000 మందికి ఉపాధి అవకాశాలు లభించాయి.



హువెల్ లైఫ్ సైన్సెస్ భవనం




పటాన్‌చెరులోని ఫార్మా కంపెనీ

... కిశోర్ శుక్లా

తెలంగాణ ఏర్పాటైన తొలినాళ్లలోనే సీఎం కేసీఆర్ రాష్ట్రానికి చెందిన పారిశ్రామికవేత్తలతో సుదీర్ఘ సమావేశం ఏర్పాటుచేసి రాష్ట్రంలో పారిశ్రామికరంగం ఎదుర్కొంటున్న సమస్యలు, పరిశ్రమల స్థాపనకు తీసుకోవాల్సిన చర్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. 2015లో టీఎస్ ఐ-పాస్ పేరుతో ప్రపంచంలోనే అత్యుత్తమ పారిశ్రామిక విధానాన్ని అమలు చేస్తూ తెలంగాణకు కొత్తగా 23 వేల పరిశ్రమలను తీసుకొచ్చారు. ముఖ్యమంత్రి దార్శనికతకు తోడు పరిశ్రమల శాఖ మంత్రి కే తారక రామారావు ప్రత్యేక చొరవతో అనేక దేశ, విదేశీ కంపెనీలు రాష్ట్రానికి క్యూ కడుతున్నాయి. ముంబై, చెన్నై, బెంగళూరు, నోయిడా వంటి నగరాలను కాదని తెలంగాణకు పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి.

### చందన్‌వెల్లి ఇండస్ట్రియల్ పార్క్

సంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో చందన్‌వల్లి ఇండస్ట్రియల్ పార్క్‌ను అభివృద్ధి చేశారు. ఇది మల్టీప్రొడక్ట్ ఇండస్ట్రియల్ పార్క్. 20,000 ఎకరాల్లో దీన్ని ప్రతిపాదించారు. అత్యుత్తమ కార్పెట్ టైల్స్ తయారీ సంస్థ వెల్‌స్పన్ ఫ్లోరింగ్, గ్రీన్ కార్పెట్స్ తదితర ఉత్పత్తులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఇతర కంపెనీలకూ భూములు కేటాయించగా, ఇప్పటికే ఉత్పత్తులు ప్రారంభమయ్యాయి.

### మెడికల్ డివైసెస్ పార్క్

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం సుల్తాన్‌పూర్‌లో 250 ఎకరాల్లో మెడికల్ డివైసెస్ పార్క్‌ను అభివృద్ధి చేశారు. ఇందులో 50 కంపెనీలు ఏర్పాటు కాగా, రూ.839 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 5,465 మందికి ఉపాధి లభించింది.

### గతానికి భిన్నంగా పరిశ్రమల రాక..

టీఎస్ఐపాస్ చట్టం రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికింది. పరిశ్రమల స్థాపనకు అనుమతుల మంజూరు సులభతరమైంది. 24 గంటల విద్యుత్తు, మెరుగైన శాంతిభద్రతలు, సుస్థిర, సమర్థవంతమైన పాలన పరిశ్రమలకు వరంగా మారాయి. సమైక్య రాష్ట్రంలో పలు కారణాలతో దాదాపు 10,000 పరిశ్రమలు మూతపడగా, పారిశ్రామికవేత్తలు దిక్కుతోచని స్థితిలో విలవిల్లాడారు. పరిశ్రమల మూతతో నిరుద్యోగం తాండవించింది. స్వరాష్ట్రంలో ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం లభించింది. ఇప్పటివరకు రూ.3.3 లక్షల కోట్ల పెట్టుబడులు రాగా, 22.50 లక్షల ఉద్యోగాల సృష్టి జరిగింది. దళిత పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు రూ.1400 కోట్లు ప్రోత్సాహకంగా అందించారు. ఖాయిలాపడిన పరిశ్రమలను పునరుద్ధరించడానికీ తగిన ప్రాధాన్యమిస్తున్నారు. సిర్పూర్ పేపర్ మిల్స్ వంటి పలు యూనిట్ల పునరుద్ధరణ దీంట్లో భాగమే.



**సుల్తాన్‌పూర్ ఎఫ్‌టీసీసీఐ ఎఫ్‌ఎల్‌వో పార్క్**

ఎఫ్‌టీసీసీఐ లేడీస్ ఆర్గనైజేషన్‌కు సుల్తాన్‌పూర్‌లో 50 ఎకరాలు కేటాయించారు. ఎంఎస్ఎంఈల గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం 26 కంపెనీలకు భూముల కేటాయింపు పూర్తయ్యింది.

### తెలంగాణపై అంతర్జాతీయంగా పెరిగిన విశ్వాసం..

తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత హైదరాబాద్ మహా నగరం పేరు జాతీయంగా, అంతర్జాతీయంగా మార్మోగిపోతున్నది. అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడంలో అగ్రగామిగా నిలుస్తున్నది. దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో తెలంగాణకు వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయి. అనేక అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొనాలని ఆహ్వానాలు అందుతున్నాయి. గతంలో వచ్చిన దిగ్గజ సంస్థలేగాక, ఈ మధ్య ఇంగ్లండ్, అమెరికాల నుంచి కూడా అనేక ప్రఖ్యాతిగాంచిన సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చాయి. కొన్ని సంస్థలు అక్కడికక్కడే ఒప్పందాలు చేసుకున్నాయి.

### ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్స్

మహేశ్వరంలో రెండు ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ల (ఈఎంసీ)ను అభివృద్ధి చేశారు. ఇందులో రావిర్యాల క్లస్టర్ 603 ఎకరాల్లో, మహేశ్వరం క్లస్టర్ 310 ఎకరాల్లో ఏర్పాటు చేశారు. రావిర్యాలలోని ఈ-సిటీలో 48 కంపెనీలకు భూములు కేటాయించగా, వాటి నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఇప్పటి వరకు రూ.1,585 కోట్ల పెట్టుబడులు రాగా, వచ్చే ఏడాది మరో రూ.2,626 కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా, మహేశ్వరం క్లస్టర్‌లో 14 కంపెనీలకు భూములు కేటాయించగా, నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఇందులో రూ.472 కోట్ల పెట్టుబడులు వస్తాయని, 5,216 మందికి ఉద్యోగాలు లభిస్తాయని అంచనా. వచ్చే ఏడాది చివరికల్లా ఇందులో ఖాళీ జాగను కూడా కంపెనీలకు కేటాయించనున్నారు.




| 2014కు ముందు పరిశ్రమల పరిస్థితి... | స్వరాష్ట్రంలో మారిన స్థితిగతులు... |
|---|---|
| 2014కు ముందు తెలంగాణలో ఉన్న పరిశ్రమలు సుమారు 12,000 | 2014 తర్వాత కొత్తగా ఏర్పాటైన పరిశ్రమలు 23,000కు పైగా |
| పారిశ్రామిక రంగానికి కేటాయించిన బడ్జెట్ రూ.300 కోట్లు | పారిశ్రామిక రంగానికి కేటాయించిన బడ్జెట్ (2023-24) రూ.5,000 కోట్లు |
| పరిశ్రమల ఏర్పాటు కోసం అందించిన ప్రోత్సాహకాలు రూ.200 కోట్లు (2014-15) | తొమ్మిదేండ్లలో పరిశ్రమలకు అందించిన ప్రోత్సాహకాలు రూ.9,500 కోట్లు |
| పరిశ్రమలకు రోజువారీ కరెంటు సగటున 5 గంటలు | పరిశ్రమలకు రోజువారీ కరెంటు 24 గంటలు |
| కరెంటు లేక మూతపడిన పరిశ్రమలు సుమారు 10,000 | కరెంటు లేక మూతపడిన పరిశ్రమలు 0 |
| పారిశ్రామిక రంగంలో ఎంతమందికి ఉపాధి 6,64,000 | పారిశ్రామిక రంగంలో ఎంతమందికి ఉపాధి 22.50 లక్షలు |




**జహీరాబాద్ ఇండస్ట్రియల్ పార్క్**

ఇక్కడ మల్టీ ప్రొడక్ట్ తయారీ జోన్‌ను ప్రతిపాదించారు. 12,635 ఎకరాల్లో నిమ్జ్ పథకం కింద మొదటి దశలో 3,909 ఎకరాలు కేటాయించారు. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.13,300 కోట్లు కాగా, రూ.60,000 కోట్ల పెట్టుబడులు వస్తాయని, తద్వారా 2.77 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. మాస్టర్ ప్లాన్, ఈఎస్ఐఏ అధ్యయనం పూర్తయ్యింది. హైదరాబాద్-నాగపూర్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా దీన్ని అభివృద్ధి చేయనున్నారు.

### కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్

1,190 ఎకరాల్లో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేశారు. రూ.11,586 కోట్ల పెట్టుబడులు వస్తాయని, 1,13,000 ఉద్యోగాలు లభిస్తాయని అంచనా. గణేశా ఎకోస్పేర్, కిటెక్స్, యంగ్ వన్ కార్పొరేషన్ తదితర జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు ఇప్పటికే రూ.2,527 కోట్ల పెట్టుబడులు పెడుతున్నాయి. వీటి ద్వారా 22,500 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. గణేశా ఎకోస్పేర్ మొదటి దశ ఉత్పత్తి ప్రారంభించగా, మిగిలిన రెండు కంపెనీలు కూడా ఈ ఏడాది చివరికల్లా ఉత్పత్తులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి.

### కొత్త పారిశ్రామిక వాడల ఏర్పాటు

స్థానిక ప్రజలకు కాలుష్య సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేక పారిశ్రామికవాడలను ఏర్పాటుచేసింది. ఇందులో 56 ఇండస్ట్రియల్ పార్క్‌లను ఏర్పాటు చేశారు. మరో 50 వరకు పార్క్‌ల పనులు కొనసాగుతున్నాయి. వివిధ జిల్లాల్లో కొత్తగా 70 ఇండస్ట్రియల్ పార్క్‌ల ఏర్పాటు ప్రతిపాదనలున్నాయి. జిల్లాలవారీగా ఒక్కొక్కటి 500 ఎకరాలకు తగ్గకుండా హైదరాబాద్ మినహా తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో ప్రత్యేక ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లను అభివృద్ధి చేస్తున్నారు. కొత్త ఇండస్ట్రియల్ పార్కుల్లో అవసరమైన విద్యుత్తు, నీటి సరఫరా, రోడ్లు తదితర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నారు.

### రాష్ట్రంలో ప్రధాన ఇండస్ట్రియల్ పార్కులు

రాష్ట్రవ్యాప్తంగా 1.45 లక్షల ఎకరాలను పరిశ్రమలకు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించగా, ఇప్పటికే వివిధ కంపెనీలకు 28,000 ఎకరాల భూమిని కేటాయించారు. ఇందులో ఫార్మాసిటీ, జహీరాబాద్ నిమ్జ్, వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ తదితర పారిశ్రామికవాడలు ముఖ్యమైనవి.

### ఫార్మాసిటీ

రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలో ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద సమీకృత ఔషధ క్లస్టర్‌గా 14,029 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో రూ.64,000 కోట్ల మేర పెట్టబడులు వస్తాయని, తద్వారా 4.20 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. మొదటి దశ కింద 8,900 ఎకరాల్లో ఔషధ పార్క్ అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందించారు.

### ఫైబర్ గ్లాస్ కాంపోజిట్ క్లస్టర్

ఇబ్రహీంపట్నం మండలం ఖాల్సా గ్రామంలోని 123 ఎకరాల్లో దీని ఏర్పాటుకు ప్రతిపాదించారు. 43 కంపెనీలకు భూముల కేటాయింపు పూర్తయ్యింది. రూ.55 కోట్ల పెట్టుబడులు, 30,000 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. వచ్చే ఏడాది జూన్ నాటికి ఉత్పత్తులు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నది.




దండుమల్కాపూర్‌లోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్



దండుమల్కాపూర్‌లోని తెలంగాణ ఇండస్ట్రియల్ ఫెడరేషన్ కామన్ ఫెసిలిటీ సెంటర్

■ యార్కర్



## ఆరు గ్యారెంటీలు ఉత్త ముచ్చటే!

అరేయ్ రాజు కాంగ్రెస్
ఆరు గ్యారెంటీల గురించి విన్నవారా?
ఎంత బాగున్నయో
అవి అమలైతే మనకిక ఢోకా ఉండదు
అన్నాడు కాంగ్రెస్ మ్యానిఫెస్టో చూసి
టెంప్ట్ అయిన తిరుపతి

*అరేయ్ తిరుపతి, నిన్న..*
*టీవీ చానళ్ల రేవంత్‌రెడ్డి మాట్లాడింది*
*ఇన్నవారా?*
*'ఇనలే.. ఏం చెప్పిండు రా' అన్నడు*

'ఒకవేళ తెలంగాణ ప్రజల కర్మగాలి
మీరు అధికారంలోకి వస్తే..
ఆ ఆరు గ్యారెంటీలు ఎలా
నెరవేరుస్తారు?'
అని యాంకర్ అడిగిండు..
దానికి రేవంతన్న
మాయలోడు సినిమాల
రాజేంద్రప్రసాద్ లెక్క
నేను గానీ ఒక్క ఈలగానీ వేశానంటే..
రేంజ్‌లో సమాధానమిచ్చిండు

*ఏం జెప్పిండో జప్పున జెప్పురా బాబు*
*అని మా తిరుపతి ఆత్రంగ*
*అడిగిండు*

'ఏం జెప్పిండా.. మన హైదరాబాద్
శివార్ల
ఉన్న రైతుల భూములు
గుంజుకుంటడట
రాచకొండ భూముల్ల కొత్త సిటీ కడ్తడట
హైదరాబాద్‌ల బంగారమోలే
యాపారం
చేసుకుంటున్న చిరు యాపారులను
అక్కడికి తోల్కపోయి దుకాణాలు
పెట్టిత్తడట
ఆడ మరో 50 వేల ఎకరాలు
రైతుల దగ్గర
తీస్కొని కంపెనీలకు అమ్ముకుంటడట
ఆ అచ్చిన పైసలతోని గీ ఆరు
గ్యారంటీలు
అమలు జేస్తడట...
అరేయ్ తిరుపతి ఏమైందిరా?
నోరు తెరిసి బిత్తరోనోలె సూత్తున్నవ్..

*ఏం లేదురా రాజు గివన్నీ అయ్యే*
*ముచ్చట్లేనారా*
*నువ్వన్నట్టే మాయలోడు సినిమాల*
*నేను గానీ ఈల వేస్తే అన్నట్టే ఉందిరా*
*గీ రేవంత్ రెడ్డి ముచ్చట*
*చల్ వాని చేతిగుర్తు అద్దు*
*ఆని ఆరు గ్యారంటీలు అద్దు పో!!*

-రాజు అతికం

## దేశంలో 2597 రిజిస్టర్డ్ పార్టీలు

దేశంలో 2597 రిజిస్టర్డ్ పార్టీలు ఉన్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. పార్టీల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. పార్టీల పేరు, వారి చిరునామాలను ప్రచురిస్తూ రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. రాజకీయ పార్టీగా రిజిస్టర్ చేసుకున్నా ఎలాంటి కార్యకలాపాలు లేని పార్టీలు 218 ఉన్నట్లుగా గుర్తించారు. రాజకీయ పార్టీల జాబితాలో నుంచి 282 పార్టీల పేర్లను తొలగిస్తున్నట్లు ప్రకటించింది. రాజకీయ పార్టీగా తొలగిస్తున్నట్లుగా 2022 మే 25న, జూన్ 20న, సెప్టెంబర్ 13న నోటీసులను జారీ చేసింది. ఆ నోటీసులకు కూడా ఆ పార్టీల ప్రతినిధుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో జాబితా నుంచి తొలగించినట్లు ప్రకటించింది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఒకే గుర్తు కేటాయించడం, ఓట్ల ఆధారంగా గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ పార్టీగా అవకాశాలు ఉంటాయి. ఈ నేపథ్యంలో మొదట రాజకీయ పార్టీలు రిజిస్టర్డ్ పార్టీలుగానే నమోదు అవుతాయి. ఈ తర్వాత జరిగే సాధారణ ఎన్నికల్లో ఆ పార్టీకి వచ్చే ఓట్లు, సీట్ల ఆధారంగా గుర్తింపు లభిస్తుంది. గుర్తింపు లభించడం ద్వారా ప్రభుత్వాలు, ఎన్నికల సంఘం నుంచి కొన్ని ప్రత్యేక హక్కులు, అధికారాలు ఆయా పార్టీల ప్రతినిధులకు లభిస్తాయి. వీటి కోసం మొదట రాజకీయ పార్టీగా నమోదు చేసుకుంటారు. అయితే కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనల ప్రకారం రాజకీయ పార్టీలు తమ ఆర్థిక కార్యకలాపాలు సాగించడం, పార్టీ అధ్యక్ష పదవికి ఎన్నిక నిర్వహించడం తదితరాలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించాల్సి ఉంటుంది.